క్లుప్తంగా

పోలీసుల గస్తీ..



గస్తీని పరిశీలిస్తున్న ఎస్ఐ రంజిత్

పోలాకి: సాగర్ కవచ్‌లో భాగంగా మండలంలోని గుప్పెడుపేట వద్ద సముద్ర తీర ప్రాంతంలో 50 మంది సిబ్బందితో పోలీసులు బుధవారం గస్తీ నిర్వహించారు. ఎస్ఐ రంజిత్ పర్యవేక్షణలో ఎక్కడికక్కడ వాహన తనిఖీలు చేపట్టారు. తీర ప్రాంత గ్రామాల్లోని ప్రజలను అప్రమత్తం చేసి, చొరబాట్లుకు అవకాశం లేకుండా చేయాలన్నదే గస్తీ లక్ష్యమని ఎస్ఐ తెలిపారు.

కుప్పిలికి రాష్ట్ర స్థాయి బహుమతి



ఆమదాలవలస: రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన కవితల పోటీల్లో ఆమదాలవలసకు చెందిన కవి, రచయిత కుప్పిలి వెంకటరాజారావు ద్వితీయ బహుమతి వరించింది. పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండలోని చివటం సంగీత సాహిత్య కళా వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో 'సదా పదిలం' కవితకు గుర్తింపు లభించింది. కవితా పోటీల నిర్వాహకురాలు గుండాల గీతామహాలక్ష్మి సమాచారం పంపినట్లు రాజారావు తెలిపారు. 126 మంది కవితలు పంపారన్నారు. రాజారావుకు బహుమతి లభించడం పట్ల సన్నిహితులు, కవులు అభినందనలు తెలిపారు.

స్త్రీలకు రక్షణగా శక్తి యాప్

నరసన్నపేట: శక్తి యాప్ స్త్రీలకు రక్షణగా ఉంటుందని, దీనిని ప్రతీ మహిళా తన ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని శక్తి టీమ్ ఎస్ఐ బాలకృష్ణ అన్నారు. స్థానిక జ్ఞానజ్యోతి డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు శక్తి యాప్‌పై బుధవారం అవగాహన కల్పించారు. మహిళలు సమస్యల్లో ఉన్నప్పుడు ఈ యాప్ ద్వారా సమాచారం ఇస్తే వెంటనే పోలీసులు వచ్చి రక్షణ కల్పిస్తారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారావు, ఏఎ అప్పారావు, టెక్కలి పోలీస్ సబ్ డివిజన్‌కు చెందిన సిబ్బంది ప్రసాదరావు, తాతారావు, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఆత్మగౌరవ పోరాట దినాలుగా పాటిద్దాం



ర్యాలీలో పాల్గొన్న కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు

ఆమదాలవలస: జ్యోతిరావ్ పూలే జయంతి (ఏప్రిల్ 11) నుంచి అంబేడ్కర్ జయంతి (ఏప్రిల్ 14) వరకు దళిత, పీడిత కులాల ఆత్మగౌరవ పోరాట దినాలుగా పాటిద్దామని కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా సహాయ కార్యదర్శి, జిల్లా కార్యవర్గ సభ్యుడు రాకోటి రాంబాబు, దుప్పాడ రాజు పిలుపునిచ్చారు. ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి 7వ వార్డు చింతాడలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పూలే, అంబేడ్కర్ ఆశయాలను సాధిద్దామని, ఆకలి, అంటరానితనం లేని సమాజం కోసం కృషి చేద్దామన్నారు. జైభీమ్ యువజన సంఘం నాయకులు ముచ్చ జగన్, ముక్కు రమణ, మల్లేసు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ స్థలంలో.. దౌర్జన్యంగా రోడ్డు నిర్మాణం!



జగనన్న కాలనీ స్థలంలో వేసిన రోడ్డు

సారవకోట: మండలంలోని జమచక్రం గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఇచ్చిన స్థలంలో నుంచి రోడ్డు నిర్మాణం చేపట్టారు. జమచక్రమం నుంచి సత్రాం పంచాయతీ గొల్లపేట గ్రామానికి జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా రూ 1.5 కోట్ల నిధులు వెచ్చించి రోడ్డు నిర్మించారు. గత ప్రభుత్వంలో 8 మంది పేదలకు ఇచ్చిన స్థలంలో వేసిన ప్లాట్ల మధ్యలో నుంచి దౌర్జన్యంగా రోడ్డు నిర్మాణం చేపట్టారు. 8 మందికి అప్పట్లో పట్టాలు సైతం అందజేశారు. అయినప్పటికీ అవేవీ పట్టకుండా రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

11న ప్రత్యేక పూజలు

సారవకోట: ఈ నెల 11వ తేదీన మండలంలోని కోదడ్డపనస స్వయంభూ అయ్యప్ప స్వామి ఆలయంలో విస్సు పర్వదిన వేడుకలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ నిర్వాహకులు బుధవారం తెలిపారు. సుబ్బారావు గురుస్వామి ఆధ్వర్యంలో హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

కేజీబీవీ తనిఖీ

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట కేజీబీవీని సమగ్ర శిక్ష జీసీడీఓ నీరజ బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థి దశ నుంచే మంచి నడవడిక, క్రమ శిక్షణ అలవాటు చేసుకోవాలని విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మధ్యాహ్న భోజనాన్ని, విద్యార్థుల హాజరు, సరుకుల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశమయ్యారు. ప్రిన్సిపాల్ ఎం.వి.అంబిక, చైర్మన్ కాగాన నాగమణి, వైస్ చైర్మన్ తూలుగు కృష్ణ, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

సాధన చేసేదెలా?

- మైదానం లేక నిరుద్యోగులు అవస్థలు
- రహదారిపైనే పరుగులు
- మైదానాన్ని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్న యువకులు



మెళియాపుట్టిలో మైదానం దుస్థితి..



ప్రైవేట్ స్థలంలో లాంగ్, హైజంప్‌లకు ఏర్పాట్లు చేస్తున్న యువకులు

మెళియాపుట్టి:

నిరుద్యోగ యువకులు బతుకు పోరులో.. ఉద్యోగ వేటలో.. లక్ష్య సాధనకు అహర్నిశలు శ్రమిస్తున్నారు. తమ ఆశయం నెరవేర్చుకునేందుకు పరుగులు పెడుతూనే ఉన్నారు. మండల కేంద్రంలో పదుల సంఖ్యలో నిరుద్యోగులు వివిధ ఉద్యోగాల కోసం కసరత్తులు చేస్తున్నారు. వారికి కనీస సౌకర్యాలు లేవు సరికదా.. సాధన చేయడానికి మైదానం కూడా లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మైదానం మంజూరు చేశారు. అప్పట్లో పలు దఫాలుగా అధికారులు మైదానం పనులు మొదలుపెట్టడానికి చర్యలు తీసుకుని చదును చేశారు. ఎన్నికలు రావడంతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మైదానాన్ని పూర్తిగా వదిలేసింది. సాధనకు కావాల్సిన సౌకర్యాలు కల్పించాలని యువకులు కోరుతున్నారు.

రహదారులపైనే పరుగులు

ఆర్మీ, నేవీ, పోలీస్, ఇతర ఉద్యోగాలను సాధించే క్రమంలో యువకులు రహదారుపైనే పరుగులు తీస్తూ కనిపిస్తున్నారు. ఉదయాన్నే రద్దీగా ఉండే టెక్కలి, నౌపడ రహదారులపై సాధన చేస్తున్నారు. ఆ సమయంలో వాహనాల రాకపోకలు అధికంగా ఉండటంతో ఏదైనా ప్రమాదం చోటుచేసుకునే అవకాశం ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మంజూరైన (స్థానిక సాయిబాబా ఆలయం పరిసరాల్లోని) మైదానాన్ని అభివృద్ధి చేయాలని యువకులు కోరుతున్నారు. అనేక మంది నిరుద్యోగులు రహదారులపై పైనే సాధన చేసి పలు ఉద్యోగాలు సంపాదించారు. దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాల్సి ఉంది.



రోడ్డుపై సాధన చేస్తున్న యువకులు

ఉద్యోగానికి చాలా కష్టపడ్డాను



మైదానం లేకపోయినా రాత్రింబవళ్లు రోడ్లపైనే సాధన చేసి కష్టపడ్డాను. సైకిల్‌పై పక్క గ్రామమైన చాపర వెళ్లి రన్నింగ్ ప్రాక్టీస్ చేసేవాడిని. అలా ఉద్యోగ ప్రయత్నంలో సఫలమయ్యాను. మా గ్రామంలో యువకులు ఎంతో మంది ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నారు. మైదానం ఉంటే ఉద్యోగాలు పొందేందుకు సహకారం అందుతుంది.

– అనపాన లక్ష్మణరావు, సీఎస్ఎఫ్ జవాన్, మెళియాపుట్టి గ్రామం

రోడ్లపై సాధన చేశా..



డిఫెన్స్‌లో ఉద్యోగం సాధించాలన్నా, క్రీడల్లో రాణించాలన్నా శరీర దారుఢ్యం తప్పనిసరి. మా గ్రామంలో మైదానం లేక రోడ్లపైనే నిత్యం పరుగులు తీసి కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాను. మైదానం ఉంటే యువకులకు మరింత ఉపయోగంగా ఉంటుంది.

– డి.విజయ్ శంకర్, ఏపీఎస్పీ కానిస్టేబుల్, మెళియాపుట్టి గ్రామం

మైదానాన్ని బాగుచేయాలి



నాలాంటి నిరుద్యోగులు సాధన చేసేందుకు మైదానం చాలా అవసరం. గ్రౌండ్ మంజూరు కోసం ఎన్నో కష్టాలు పడ్డాం. చివరికి మంజూరైనా.. పనులు జరగకపోవడం బాధాకరం. దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి.

– గాలి శంకర్, నిరుద్యోగి, మెళియాపుట్టి

శిథిలావస్థలో..



సరుబుజ్జిలి మండలంలోని రొట్టవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. విద్యార్థులు, తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. తరగతి గదుల తలుపులు, గోడలు, శ్లాబు పైకప్పు పూర్తిగా పాడయ్యాయి. భవనం వెలుపుల నాచుపట్టింది. అధికారులు స్పందించి భవనాన్ని మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. – సరుబుజ్జిలి

పౌష్టికాహారం అందజేత



ఆమదాలవలస పట్టణంలోని మెట్టక్కివలసలో అర్బన్ హెల్త్ సెంటర్‌కు వైద్య పరీక్షల కోసం వచ్చిన సుమారు 70 మంది గర్భిణులకు బుధవారం పౌష్టికాహారాన్ని అందించారు. ప్రతి నెలా 9వ తేదీన పౌష్టికాహారం అందజేస్తున్నట్లు మెట్టక్కివలస సత్యసాయి సేవా సమితి సభ్యులు తెలిపారు. బీఆర్‌నగర్‌కు చెందిన దన్నాన లక్ష్మి పౌష్టిహాకారాన్ని సమకూర్చారన్నారు. – ఆమదాలవలస

వైద్య పరీక్షలు



హిరమండలం మండలంలోని చొర్లంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు పలు రకాల వైద్య పరీక్షలను వైద్యాధికారి బుధవారం నిర్వహించారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 41 మందికి వైద్య పరీక్షలు చేశారు. రక్త పరీక్షలు, స్కానింగ్ నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు. – హిరమండలం

వైభవంగా పట్టాభిషేకం



నరసన్నపేట పట్టణంలోని దేశవానిపేట రామ మందిరంలో బుధవారం సీతారాముల పట్టాభిషేకం వైభవంగా నిర్వహించారు. భక్తులు, గ్రామ పెద్దలు, రుత్వికులు పాల్గొన్నారు. – నరసన్నపేట

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం



బాధితులతో మాట్లాడుతున్న ధర్మాన కృష్ణచైతన్య

- వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జి, జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య

పోలాకి: మండలంలోని రాజపురం గ్రామంలో అధికార పార్టీకి చెందిన కొందరు నాయకుల కక్ష సాధింపుతో.. భూమిని కోల్పోయిన అవ్వ శాంతమ్మ, గేదెల శారద కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అండగా నిలుస్తోందని జెడ్పీటీసీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జి ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. బుధవారం రాజపురం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించారు. కప్ప చెరువు ఆక్రమణల పట్ల అధికారులు తీరు ఆక్షేపనీయమని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో రెవెన్యూ సిబ్బంది వేసిన హద్దురాళ్లను కాదని, ఆ సర్వే తప్పుగా చూపించి మళ్లీ కొలతలు వేశారని బాధితులు చెప్పడంతో.. ఆ రాళ్లను సైతం పరిశీలించారు. గ్రామాల్లో పేదల బతుకులతో రాజకీయాలు మానుకోవాలని కూటమి నాయకులకు హితవు పలికారు. బాధితుల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం కొనసాగిస్తుందని, న్యాయ పోరాటం ద్వారా తప్పుచేసిన వారిని కోర్టు ముందు నిలబెడతామన్నారు. మండల పరిషత్ సలహాదారుడు ముద్దాడ బైరాగినాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు, యువజన, ఎస్సీ విభాగాల అధ్యక్షుడు రెంటికోట త్రినాథరావు, కన్నేపల్లి లక్ష్మణరావు, పార్టీ నాయకులు చింతు రాఘవరావు, సాలిన నగేష్‌కుమార్, కూన ఢిల్లేశ్వరరావు, చింతాడ భీమారావు, చితపాన లక్ష్మీనారాయణ ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఆమదాలవలస: ఈ నెల 11వ తేదీన పట్టణంలోని 33/11 కేవీ ఇండోర్ సబ్ స్టేషన్ పరిధిలో (కణుగులవలస ఫీడర్) మరమ్మతులు, చెట్టు కొమ్మలు తొలగించనున్నారు. ఈ మేరకు విద్యుత్‌శాఖ ఈఈ పైడి యోగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంట వరకు కణుగులవలస, వెంగళరావుకాలనీ, గేటు ప్రాంతం, పాత ఆమదాలవలస, టి.ఎస్.ఆర్.కాలేజ్, రావికంటిపేట, కుద్దిరాం తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

సరుబుజ్జిలి మండలంలో..

సరుబుజ్జిలి: ఈ నెల 11వ తేదీన యరగాం 11 కేవీ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించనున్నారు. ఈ మేరకు ఈఈ పైడి యోగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గోనెపాడు, బప్పడాం, కె.జె.పేట, కాగితాపల్లి, తెలికిపెంట, పాతపాడు, యరగాం, సుబ్బపేట, పెద్దసవలాపురం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

పాతపట్నం మండలంలో..

పాతపట్నం: ఈ నెల 11వ తేదీన పాతపట్నం సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ మేరకు విద్యుత్‌శాఖ డీఈఈ జి.ప్రసాదరావు బుధవారం తెలిపారు. ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కాపుగోపాలపురం, చంగుడి, సరాలి, తిడ్డిమి, రంకిణి, సూర్యనారాయణపురం, దాసుపురం, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవాలు

సరుబుజ్జిలి: పురుషోత్తపురం గ్రామంలోని మండలమ్మ ఆలయ వార్షిక ఉత్సవాలు గురువారం నుంచి మూడు రోజులు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, వేదపండితులు బుధవారం తెలిపారు.

అమ్మవారి చరిత్ర..

పుట్టిన ప్రతీ మనిషికి పేరుపెట్టడం ఆనవాయితీ. దేవునికే నామకరణం చేసే భాగ్యం పురుషోత్తపురం గ్రామస్తులకు దక్కింది. మండలమ్మ అని నామకరణం చేసింది పురుషోత్తపురం వాసులే. 1980లో వంశధార నదికి భారీ వరదలువచ్చాయి. గ్రామం, పంట పొలాలు మునిగాయి. వారంరోజులు రాకపోకలు నిలిచిపోయాయి. ఆ వరదలకు ఎక్కడి నుంచో అమ్మవారి విగ్రహం వచ్చి గ్రామ శివారులో ఉన్న చెరువు గట్టుపై వెలసింది. ఆ సమయంలో అటువైపుగా గొర్రె మందలతో వస్తున్న కాపరి చూసి గ్రామస్తులకు సమాచారం తెలిపాడు. అమ్మవారికి ఎటువంటి పేరులేకపోడంతో గ్రామస్తులంతా కలిసి గొర్రెలు మందలతో వచ్చిన వ్యక్తి మొదటి చూశాడు. మండలమ్మ అని నామకరణం చేశారు. గ్రామంలో ఏ శుభకార్యం చేసినా ముందుగా అమ్మవారి ఆశీస్సులు అందుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

భూముల రీ సర్వేపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, రైతులు

పాతపట్నం: భూముల రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని టెక్కలి ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి అన్నారు. గురండి గ్రామంలో తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ గ్రామంలో రీ సర్వేకు సంబంధించి ఏయే ప్రాంతాల్లో సర్వే ఉంటుందో రెండు రోజుల ముందుగానే రైతులకు సమాచారం ఇస్తామన్నారు. రైతులు భూ రికార్డులు, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా, ఆధార్ జిరాక్స్ కాపీలు, ఫోన్ నంబర్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో వీఆర్వోకు అందజేయాలన్నారు. రైతులు సర్వేకు హాజరై తమ భూములకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే ఆర్జీల రూపంలో ఇవ్వాలన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రీ సర్వే డీటీ సునీల్ కుమార్, సర్పంచ్ తులసినాయుడు, మాజీ సర్పంచ్ జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేరండి



ప్రభుత్వ పాఠశాలలో చేరాలని కోరుతున్న ఉపాధ్యాయులు

సారవకోట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని మండలంలోని చోడసముద్రం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో ఉన్న బడి ఈడు పిల్లల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులను కలిశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతుందని, మౌలిక సదుపాయాలు ఉన్నాయన్నారు. హెచ్‌ఎం సీతారాం, పాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ డేటాను పూర్తిచేయాలి



మాట్లాడుతున్న ఆర్ఐఓ దుర్గారావు

పాతపట్నం: మండలంలోని ఇంటర్మీడియెట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల సిటిజన్ డేటాను వెంటనే పూర్తిచేయాలని ఆర్ఐఓ దుర్గారావు అన్నారు. పాతపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాళ్లతో బుధవారం సిటిజన్ డేటాపై సమావేశం నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, అంబేడ్కర్ గురుకులం, మహేంద్ర, కిరణ్మయి, మోడల్, కేజీబీవీ కళాశాలలకు చెందిన 47 మంది డేటా పెండింగ్‌లో ఉందన్నారు. డేటా సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రిన్సిపాళ్లు వైకుంఠరావు, అర్చన, సుజాత, మంగపతి, పి.వి.రమణ, జగన్మోహన్‌రావు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధర తగ్గించాలి



నిరసన తెలియజేస్తున్న సీఐటీయూ నాయకులు, ప్రతినిధులు

ఆమదాలవలస: పెంచిన వంట గ్యాస్ ధరను కేంద్ర ప్రభుత్వం వెంటనే తగ్గించాలని సీఐటీయూ జిల్లా కన్వీనర్ కె.నాగమణి, జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. గ్యాస్ ధర పెంపుపై సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని పారిశ్రామికవాడ వద్ద బుధవారం నిరసన తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు తగ్గినందున వినియోగదారులకు గ్యాస్ సిలిండర్ ధరను తగ్గించకుండా.. రూ.50 పెంచడం దారుణమన్నారు. గతంలో రూ.400 ఉండే సిలిండర్ ధర రూ.880 పెరిగిందన్నారు. దీనివలన ఉజ్వల పథకం లబ్ధిదారులు, సాధారణ వినియోగదారులపై భారం పడుతుందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్యాస్ సిలిండర్ ధరలు పెంచడంతోపాటు, సబ్సిడీని కూడా తగ్గించుకుంటూ వచ్చిందని మండిపడ్డారు. కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్లు రాయితీ ఇస్తూ.. రాష్ట్రంలోని వినియోగదారులపై సంవత్సరానికి రూ.400 కోట్ల భారం వేయడం తగదన్నారు. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని లీటర్‌కు రూ.2 చొప్పున పెంచుతూ నిర్ణయం తీసుకోవడంతో లీటర్ పెట్రోల్‌పై రూ.13, డీజిల్‌పై రూ.10 అదనపు భారం ప్రజలపై పడే అవకాశం ఉందన్నారు. 2014 నుంచి 2016 మధ్య మోదీ సర్కార్ ఇందనాలపై 9 సార్లు సుంకాన్ని పెంచిందని విమర్శించారు. సీఐటీయూ నాయకులు బొడ్డేపల్లి జనార్ధనరావు, బెండి సూర్యనారాయణ, బండి హేమసుందర్, బి.రమణమూర్తి, జి.లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు



నరసన్నపేట: చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ శంకర్

నరసన్నపేట: స్థానిక లక్ష్మీ టాకీస్ కూడలి వద్ద నరసన్నపేట మేజరు పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ బూరల్లి శంకర్ బుధవారం ప్రారంభించారు. వేసవి మూడు నెలలూ చలివేంద్రం నిర్వహిస్తామన్నారు. ఉప సర్పంచ్ ఎస్.కృష్ణబాబు, ఈఓ ద్రాక్షాయిని, తదితరులు పాల్గొన్నారు.



సారవకోట: చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్, యువజన సంఘం సభ్యులు

సారవకోట: మండలంలోని అలుదు గ్రామంలో విజయాంబికా యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. జాతీయ రహదారికి ఆనుకుని ఈ మార్గంలో కాలినడకన వెళ్లే ప్రయాణికుల కోసం వేసవిని దృష్టిలో పెట్టుకుని ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం అధ్యక్షుడు చల్లా ఆనందరావు తెలిపారు. సర్పంచ్ సాగిపల్లి దండాసి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి

పొందూరు: స్థానిక జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ ఎంపీడీఓ మన్మథరావు, ఈఓ మోహన్‌బాబులకు బుధవారం ఆ కాలనీ వాసులు వినతిపత్రాన్ని అందజేశారు. సుమారు 600 మీటర్ల మేరకు లైట్లు లేవని, దీంతో చీకట్లో కాలనీకి చేరుకోవాలంటే భయాందోళనకు గురవుతున్నామని పేర్కొన్నారు. ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని కోరారు.

రాముడు ఆదర్శప్రాయుడు



ప్రవచనాలు చెబుతున్న షణ్ముఖ శర్మ

కొత్తూరు: ప్రతి ఒక్కరూ రాముడుని ఆదర్శంగా తీసుకోవాలని, రామనామ స్మరణ చేయాలని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, బ్రహ్మశ్రీ సామవేద షణ్ముఖ శర్మ అన్నారు. కొత్తూరులోని వేంకటేశ్వర స్వామి ఆలయ వసంతోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీరాముని గొప్పతనం గుర్తించి వివరించారు. శ్రీరాముడుని ప్రతీ నిత్యం స్మరిస్తే ముక్తి కలుగుతుందన్నారు. రాముడు ఆరాధ్యుడని అన్నారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు చేసిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కార్యదర్శులనే బాధ్యులను చేయడం తగదు



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

పొందూరు: ప్రభుత్వం చేపడుతున్న సర్వేలకు సచివాలయ కార్యదర్శులకు మాత్రమే బాధ్యతలు అప్పగించడం తగదని పొందూరు మండల కార్యదర్శులు అన్నారు. ఈ మేరకు ఎంపీడీఓ మన్మథరావుకు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. రోజువారి విధులతోపాటు సర్వేలు చేయడం కష్టంగా ఉందని వినతిపత్రంలో పేర్కొన్నారు. సర్వేల బాధ్యతలకు కార్యదర్శులతోపాటు సచివాలయ సిబ్బందికి అప్పగించాలని కోరారు. పొందూరు ఈఓ మోహన్‌బాబు, కార్యదర్శులు పి.జగదీష్, రాజీవ్, ఎం.శ్రీనివాసరావు, రామకృష్ణ, జనార్దనరావు, శ్రీను, తదితరులు ఉన్నారు.